10 YEAR ANNIVERSARY 2014 - 2024

# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

ఆదివారం | 24 నవంబర్ 2024 | పేజీలు 8




# రైతు సదస్సును మూడు రోజులు నిర్వహించండి

- నా సొంత నియోజకవర్గ ప్రజల్ని నేనెందుకు ఇబ్బంది పెడతాను?: రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు
- కొడంగల్‌లో ఏర్పాటు చేయబోయేది ఫార్మా సిటీ కాదు... ఇండస్ట్రియల్ కారిడార్ అన్న సీఎం
- నియోజకవర్గంలో యువతకు ఉపాధి కల్పించడమే తన ఉద్దేశమని వెల్లడి
- భూసేకరణ పరిహారం పెంపును కూడా పరిశీలిస్తామని హామీ

-3 లో

**హైదరాబాద్ పెన్ పవర్:**నా సొంత నియోజకవర్గ ప్రజలను నేనెందుకు ఇబ్బంది పెడతాను అంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అలాగే కొడంగల్‌లో ఏర్పాటు చేయబోయేది ఫార్మా సిటీ కాదని, ఇండస్ట్రియల్ కారిడార్ అని వెల్లడించారు. లగచర్ల ఘటనపై నేడు వామపక్ష పార్టీల ప్రతినిధుల బృందం సీఎంకు వినతి పత్రం అందించింది. ఈ సందర్భంగా వారితో సీఎం మాట్లాడుతూ... కొడంగల్ నియోజకవర్గంలో యువతీయువకులకు ఉపాధి కల్పించడమే తన ఉద్దేశమన్నారు. అక్కడ కాలుష్య రహిత పరిశ్రమలనే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. భూసేకరణ పరిహారం పెంపును కూడా పరిశీలిస్తామని వెల్లడించారు. భూసేకరణ నేపథ్యంలో గురువారం నాడు వామపక్ష పార్టీల నేతలు వికారాబాద్ జిల్లా లగచర్ల, రోటితండాలలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. అక్కడి సమస్యలను వారు సీఎం దృష్టికి తీసుకు వెళ్లారు.

-3 లో

# ముమ్మరంగా కుటుంబ,కులగణన సర్వే

- 13 రోజులు..21528 నివాసాలలో సర్వే పూర్తి.
- ఒక్కో ఇంటికి కనీసం 40 నిమిషాల సమయం.
- తిరుమలాయపాలెం మండలంలో 96 శాతం పూర్తి.
- 26వ తేదీ వరకు పూర్తి చేస్తామంటున్న అధికారులు.



-2 లో

# కక్షపూరితంగా నరేందర్ రెడ్డిని జైల్లో వేశారు

- జైల్లో ఉన్న పట్నం నరేందర్ రెడ్డి మాకే ధైర్యం చెప్పారు: కేటీఆర్
- నా కోసం కాదు.. రైతుల కోసం కొట్లాడమని నరేందర్ రెడ్డి మాతో చెప్పారన్న కేటీఆర్
- వేధింపుల కారణంగా మాజీ సర్పంచ్ ఆత్మహత్య చేసుకున్నాడని విమర్శ



**హైదరాబాద్ పెన్ పవర్:**నా కోసం కాదు... రైతుల కోసం కొట్లాడండని జైల్లో ఉన్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి తమతో చెప్పారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రైతులకు సంఘీభావంగా చేస్తున్న ధర్నా బాగా చేయాలని తమతో అన్నారని పేర్కొన్నారు. చర్లపల్లి జైల్లో ఉన్న నరేందర్ రెడ్డిని కేటీఆర్, శ్రీనివాస్ గౌడ్, మహమూద్ అలీ, తదితరులు కలిశారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు."లగచర్ల మా గిరిజనుల పంచాయతీ... ఈ విషయం రాష్ట్రంలోని గిరిజనులందరికీ తెలిసేలా చూడండని నరేందర్ రెడ్డి మాకు ధైర్యాన్ని... ఉత్సాహాన్ని ఇచ్చారు" అని కేటీఆర్ తెలిపారు. లగచర్ల ఘటనపై న్యాయస్థానంలో కొట్లాడుతామన్నారు. కోర్టులో రైతులకు న్యాయం జరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. పేద, గిరిజన, దళిత, బలహీనవర్గాల రైతుల తరఫున పోరాటం చేసినందుకు... రేవంత్ రెడ్డి కక్షపూరితంగా పట్నం నరేందర్ రెడ్డిని జైల్లో వేశారని ఆరోపించారు. జైల్లో ఆయనను కలిసినప్పుడు తమకు ఒకటే మాట చెప్పారని... తన గురించి ఆలోచించవద్దని చెప్పారని తెలిపారు. కానీ చేయని తప్పుకు 30 మంది అమాయక రైతులను జైల్లో పెట్టారని, ఆ కొడంగల్ పేద రైతుల పక్షాన ఉండాలని తమకు పట్నం నరేందర్ రెడ్డి సూచించారన్నారు. మంచి పొలాలను లాక్కొని... అక్కరలేని ఫార్మా విలేజ్‌ని కొడంగల్ రైతులపై రుద్దుతున్నారని పట్నం మహేందర్ రెడ్డి తమతో చెప్పారన్నారు. కొడంగల్ నుంచి కొండారెడ్డిపల్లె వరకు అరాచకాలు చేస్తున్న వారు గద్దెనెక్కి కూర్చున్నారని, రైతులు మాత్రం జైల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూములు ఇవ్వమని చెప్పినందుకు ఆడవాళ్లు, చిన్నపిల్లలు అని చూడకుండా దారుణంగా ప్రవర్తించారని ధ్వజమెత్తారు.రేవంత్ రెడ్డి గెలుపు కోసం పని చేసిన 85 ఏళ్ల మాజీ సర్పంచ్ సాయిరెడ్డిని కూడా వేధించారని ఆరోపించారు. ఆయన ఇంటికి అడ్డంగా గోడ కట్టారని, దీంతో మనస్థాపానికి గురై ఆయన ఆత్మహత్య చేసుకున్నారన్నారు. నియంతలెందరో కాలగర్భంలో కొట్టుకుపోయారని, నీలాంటి వాళ్లు అలా కొట్టుకుపోతారని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి అన్నారు. చేయని తప్పుకు రైతులను జైల్లో పెట్టారని ధ్వజమెత్తారు.

# పట్నం నరేందర్ రెడ్డిని ఉగ్రవాదిలా అరెస్ట్ చేశారు

## కోర్టులో న్యాయవాది

- అరెస్ట్ చేసే సమయంలో పోలీసులు నిబంధనలు పాటించలేదన్న నరేందర్ రెడ్డి న్యాయవాది
- భూసేకరణకు వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొట్టారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు
- నరేందర్ రెడ్డి రెచ్చగొట్టడం వల్లే కలెక్టర్ మీద దాడి జరిగిందన్న పీపీ
- తీర్పును రిజర్వ్ చేసిన కోర్టు

**హైదరాబాద్ పెన్ పవర్:**15 మంది పోలీసులు మఫ్టీలో వచ్చి పట్నం నరేందర్ రెడ్డిని ఓ ఉగ్ర వాదిలా అరెస్ట్ చేసి తీసుకుపోయారని ఆయన తరఫు న్యాయ వాది గండ్ర మోహన్ రావు కోర్టుకు తెలిపారు. లగచర్ల దాడి కేసులో అరెస్టై, జైల్లో





# ముమ్మరంగా కుటుంబ,కులగణన సర్వే






- **13 రోజులు..21528 నివాసాలలో సర్వే పూర్తి.**
- **ఒక్కో ఇంటికి కనీసం 40 నిమిషాల సమయం.**
- **తిరుమలాయపాలెం మండలంలో 96 శాతం పూర్తి.**
- **26వ తేదీ వరకు పూర్తి చేస్తామంటున్న అధికారులు.**

**తిరుమలయపాలెం,పెన్ పవర్,నవంబర్ 23:** తెలంగా ణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కుటుంబ,21528 సర్వే తిరుమలాయపాలెం మండల వ్యాప్తంగా ముమ్మరంగా కొనసాగుతోందని మండల తాసిల్దార్ పి వి రామకృష్ణ ఓ ప్రకటనలో తెలియజేశారు.. ఈ కులగణన సర్వేలో భాగంగా సామాజిక, ఆర్థిక, విద్యా, ఉద్యోగ, రాజకీయ వివరాలను సేకరిస్తున్నారు. ఈ సమగ్ర ఇంటింటి సర్వే లో మొత్తం 22749 నివాసాలు గుర్తించగా, నిన్నటి వరకు సుమారుగా 21528 నివాసాలలో సర్వే పూర్తి చేసి 96 శాతం సాధించిందన్నారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం లోని 41 గ్రామాల పరిధిలో నిర్వహిస్తున్న నిత్యం అన్ని విభాగాలకు చెందిన అధికారులు 184 బ్లాకులకు గాను 148 ఏన్యుమరేటర్లు 13 మంది సూపర్వైజర్ తో పాటు మండల స్పెషల్ ఆఫీసర్ సుమన్ చక్రవర్తి, పాలేరు కాంసెన్సీ స్పెషల్ ఆఫీసర్ నూరుద్దీన్, అడిషనల్ చార్జ్ ఆఫీసర్ ఎంపీడీవో సిలార్ సాహెబ్, చార్జ్ ఆఫీసర్ మండల తహసిల్దార్ పీవీ రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పర్యవేక్షణలోసర్వేలు జరుగుతున్నాయి. ఉపాధ్యాయులు ఉదయం పాఠశాల విధులకు హాజరై మధ్యాహ్నం తర్వాత సర్వేకు వెళుతుండగా ఇతర విభాగాల అధికారులు సర్వేకు పూర్తి సమయం కేటాయిస్తున్నారు. తిరుమలాయపాలెం మండలంలో కుటుంబ సర్వే ఈనెల 6న మొదలైన ఇంటింటికి వివరాల సేకరణ మాత్రం 9వ తేదీన ప్రారంభమైంది. ఈ 13 రోజుల్లో మండల వ్యాప్తంగా ఇప్పటివరకు 96 శాతం పూర్తయినట్లు ఏ ఎస్ ఓ రామకృష్ణారెడ్డి తెలిపారు. సర్వేకు వెళ్లిన సమయంలో ఇంటి వద్ద కొన్ని ప్రాంతాలలో ఎవరు ఉండకపోవడం, ఇంటికి వచ్చాక యజమానులు వెతుకుతుండడంతో రేషన్ కార్డులు వెతకడంతో చాలా సమయం పడుతుందంటున్నారు. ఒక ఇంటి యజమానులు వివరాలు వెల్లడించడంలో తీవ్ర జాప్యం జరుగుతుందంటున్నారు. మండల ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సిబ్బందికి సలహాలు సూచనలు ఇస్తున్నారు.


## ఈనెల 26 వరకు సర్వే పూర్తి చేస్తాం

తిరుమలాయపాలెం మండలంలో సమగ్ర సర్వే చురుగ్గా కొనసాగుతుందని మండల తాసిల్దార్ పీవీ రామకృష్ణ,మండల స్పెషల్ ఆఫీసర్ సుమన్ చక్రవర్తి, ఏ ఎస్ ఓ రామకృష్ణారెడ్డి
ఓ ప్రకటనలో తెలియజేశారు. సమగ్ర సర్వే చేసేందుకు వివిధ ప్రభుత్వ శాఖ ఉద్యోగుల తో పాటు అంగన్వాడి ఆశా వర్కర్లు, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో సమగ్ర సర్వే సజావుగా జరుగుతుందని వారు తెలిపారు. ఇక స్టిక్కర్లు వేసినప్పుడు ఒకే కుటుంబం అని చెప్పిన వారు, సిబ్బంది సర్వేకు వెళ్ళినప్పుడు ఒకే ఇంట్లో రెండు మూడు కుటుంబాలు ఉన్నాయని చెబుతున్నారన్నారు,అందువల్ల అదనపు సమయం పడుతుందని అయినప్పటికీ ఈనెల 26 వరకు సర్వే పూర్తి చేస్తామని వారన్నారు.









# ఘన విజయంతో ప్రియాంక పార్లమెంటులో అడుగుపెట్టబోతున్నారు: రేవంత్ రెడ్డి


- వయనాడ్ లో భారీ ఆధిక్యతలో ప్రియాంక
- ఆమెకు వయనాడ్ ప్రజలు రికార్డు విజయాన్ని అందిస్తారన్న రేవంత్
- గత ఎన్నికల్లో రాహుల్ కు 3.64 లక్షల ఓట్ల మెజార్టీ



**హైదరాబాద్ పెన్ పవర్:**వయనాడ్ లోక్ సభ ఉప ఎన్నికల ఫలితాలలో కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకాగాంధీ భారీ ఆధిక్యతతో దూసుకెళుతున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎక్స్ వేదికగా స్పందిస్తూ... వయనాడ్ ప్రజలు ఆమెకు రికార్డు స్థాయి విజయాన్ని అందిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

ఘన విజయంతో ప్రియాంకాగాంధీ పార్లమెంటులో అడుగుపెట్టబోతున్నారని చెప్పారు. వయనాడ్ లో గత ఎన్నికల్లో రాహుల్ గాంధీకి 3.64 లక్షల ఓట్ల మెజార్టీ వచ్చింది. ఈ మెజార్టీని ప్రియాంక బ్రేక్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# ఉద్యోగాలకే ఫస్ట్ ఇయర్...






**హైదరాబాద్, నవంబర్ 23, పెన్ పవర్:**
ప్రజా పాలనలో తెలంగాణ యువత భవిత మలుపు తిరిగిందా అంటే అవుననే అంటుంది తెలంగాణ ప్రభుత్వం. తొలి ఏడాదిలోనే ప్రజా ప్రభుత్వం యువతకు ఇచ్చిన మాట ప్రకారం ఉద్యోగ నియామకాల మేళా నిర్వహించామంటుంది. ఉద్యోగాల భర్తీలో కొత్త రికార్డు నమోదు చేసింది తెలంగాణ సర్కార్. దేశంలో ఏ రాష్ట్రంలోలేని విధంగా మొదటి ఏడాదిలోనే 53 వేలకుపైగా ఉద్యోగ నియామకాలు చేపట్టింది. గడిచిన పదేండ్లలో ఉద్యోగాల భర్తీలేక విసిగివేసారిన నిరుద్యోగుల జీవితాల్లో సరికొత్త మార్పు తెచ్చింది. అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యూపీఎస్సీ తరహాలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్షాళన చేపట్టారు. అప్పటివరకు పెండింగ్‌లో ఉన్న పరీక్షలు, ఫలితాలకు ఉన్న అడ్డంకులన్నింటినీ ప్రభుత్వం తొలిగించింది. పదేండ్లుగా ఉద్యోగాల భర్తీ లేనందున యువత నష్టపోకుండా టీజీపీఎస్సీ నియామకాలకు వయో పరిమితిని సడలించింది. గత ప్రభుత్వలో రద్దయినవి.. వాయిదా పడ్డవి.. పెండింగ్‌లో పెట్టిన ఫలితాలన్నింటినీ విడుదల చేసింది. ఎంపికైన అభ్యర్థులందరికీ నియామక పత్రాలను అందించింది తెలంగాణలో వార్షిక జాబ్ క్యాలెండర్‌ను సైతం ప్రకటించింది. క్యాలెండర్ ప్రకారం ప్రభుత్వ ఉద్యోగ నియామకాలను నిరంతర ప్రక్రియగా నిర్వహించే వినూత్న విధానాన్ని అమల్లోకి తెచ్చింది. బీఆర్ఎస్ హయాంలో పదేండ్లలో ఒకేసారి డీఎస్సీ వేసి 7,857 టీచర్ పోస్టులు భర్తీ చేస్తే? కొత్త ప్రభుత్వం కేవలం పది నెలల వ్యవధిలోనే 11,062 పోస్టులతో మెగా డీఎస్సీ 2024 నిర్వహించింది. జులైలో పరీక్షలు నిర్వహించి, రికార్డు వేగంతో సెప్టెంబర్ 30వ తేదీన ఫలితాలను వెల్లడించింది. ఎంపికైన అభ్యర్థులకు దసరా పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియామక పత్రాలు అందించారు. వీరిలో 10,006 మంది ఉద్యోగాల్లో చేరారు. రెసిడెన్షియల్ సొసైటీల పరిధిలో టీజీటీ, పీజీటీ, జూనియర్ లెక్చరర్లు, డిగ్రీ కాలేజీ లెక్చరర్ పోస్టులన్నీ కలిపి కొత్త ప్రభుత్వం 8,304 మందికి నియామక పత్రాలను అందించింది. లీకేజీతో గందరగోళంగా మారిన గ్రూప్ 1 పరీక్షను కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేసింది. 563 పోస్టులతో కొత్త నోటిఫికేషన్ ఇచ్చింది. గ్రూప్ 1 ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలను విజయవంతంగా నిర్వహించింది. షెడ్యూలు ప్రకారమే నవంబర్లో గ్రూప్ 3 పరీక్షలు నిర్వహించింది. డిసెంబర్ 15, 16 తేదీల్లో గ్రూప్ 2 పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేసింది. టీజీపీఎస్సీ వివిధ నోటిఫికేషన్‌ల ద్వారా ఈ ఏడాదిలో 3,393 ఉద్యోగ నియామకాలు చేపట్టింది. ఇరిగేషన్ విభాగంలో 687 మంది ఏఈఈలకు, రవాణా శాఖ పరిధిలో 96 మంది ఏఎంవీఐలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా నియామక పత్రాలు అందించారు. పెండింగ్ లో పెట్టిన గ్రూప్ 4 తుది ఫలితాలను టీజీపీఎస్సీ వెల్లడిం చింది. మొత్తం 8,143 మంది ఎంపికైన అభ్యర్థులకు ప్రజా ప్రభుత్వం తొలి విజయోత్సవాల సందర్భంగా నియామక పత్రాలు అందించనుంది. పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు ద్వారా కానిస్టేబుల్ పోస్టుల నియామకాలకు ఉన్న అడ్డంకులన్నింటీనీ ప్రభుత్వం అధిగమించింది. ఎంపికైన 16,067 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందించింది. మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్మెంట్ బోర్డు అధ్వర్యంలో 7094 మంది స్టాఫ్ నర్సుల నియామకాలు విజయవంతంగా పూర్తి చేసింది. వీరిలో 6,956 మందికి ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చింది. ఇటీవలే 1,284 ల్యాబ్ టెక్నిషియన్, 2,050 నర్సింగ్ ఆఫీసర్ (స్టాఫ్ నర్స్) పోస్టులు, 633 ఫార్మసిస్ట్ (గ్రేడ్ 2) పోస్టుల భర్తీ నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. మొత్తం 5,378 పోస్టుల నియామకాలు వివిధ దశల్లో పూర్తి కావల్సి ఉంది.

## పట్నం నరేందర్ రెడ్డిని ఉగ్రవాదిలా అరెస్ట్ చేశారు

- మొదటి పేజి తరువాయి
ఉన్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో ఈరోజు కూడా వాదనలు జరిగాయి. కొడంగల్ కోర్టు విధించిన రిమాండ్‌ను కొట్టేయాలని నరేందర్ రెడ్డి క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ జరిపారు.ప్రభుత్వం తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగేశ్వరరావు వాదనలు వినిపించారు. ఫార్మా విలేజ్ కోసం ప్రభుత్వం చేపట్టాలనుకున్న భూసేకరణకు వ్యతిరేకంగా ప్రజల్ని రెచ్చగొట్టేలా ఆయన మాట్లాడారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టుకు తెలిపారు. ఇందుకు సంబంధించి వీడియోలను సీడీల రూపంలో కోర్టుకు అందించారు. నరేందర్ రెడ్డి రెచ్చగొట్టడం వల్లే ప్రజలు, రైతులు... కలెక్టర్, ఇతర అధికారులపై దాడి చేసినట్లు తెలిపారు. నరేందర్ రెడ్డి కేబీఆర్ పార్కుకు వెళుతుంటే అరెస్ట్ చేసినట్లు చెప్పారు.అరెస్ట్ చేసే సమయంలో పోలీసులు నిబంధనలు పాటించలేదని పట్నం నరేందర్ రెడ్డి తరపు న్యాయవాది కోర్టులో వాదనలు వినిపించారు. అరెస్టుకు సంబంధించి కొన్ని ఫొటోలను కోర్టుకు సమర్పించారు. ఇరువైపుల వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది.

## రైతు సదస్సును మూడు రోజులు నిర్వహించండి

రైతు సదస్సును మూడ్రోజులు నిర్వహించండి

**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రజా ప్రభుత్వ విజయోత్సవాల్లో భాగంగా మహబూబ్ నగర్‌లో నవంబర్ 30న జరగనున్న రైతు సదస్సులో అధిక సంఖ్యలో రైతులు పాల్గొనేలా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇది బహిరంగ సభలా కాకుండా రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమంలా ఉండాలన్నారు. నేడు ఆయన వ్యవసాయ శాఖపై సమీక్ష నిర్వహించారు.

వ్యవసాయంలో వస్తున్న ఆధునాతన సాగు పద్ధతులను, మెలకువలను రైతులకు తెలియజేసేలా వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులు అప్పటికప్పుడు వచ్చి వెళ్లేలా కాకుండా వారికి అవగాహన కల్పించేలా మూడ్రోజుల పాటు సదస్సు నిర్వహించాలన్నారు. అందుకే ఈ స్టాల్స్‌ను 28వ తేదీ నుంచి అందుబాటులో ఉంచాలన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి



**హైదరాబాద్ పెన్ పవర్:** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో చిన్నారితో పాటు ఆమె అమ్మమ్మ దుర్మరణం చెందిన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపల్లి పట్టణంలోని కన్నాల బస్తికి చెందిన టింకరి కల్యాణి, అలేఖ్యతో పాటు భర్త రాజేష్, కూతురు ప్రియమేఘన ఓ ఫంక్షన్‌కు హాజరయ్యేందుకు భూపాలపల్లికి వెళ్లారు. తిరిగి వస్తున్న క్రమంలో బెల్లంపల్లిలోని సబ్ స్టేషన్ జాతీయ రహదారి వద్ద కారు అదుపుతప్పింది. చిన్నారి అక్కడికక్కడే మృతిచెందింది. మిలిగిన వారికి తీవ్ర గాయాలు కాగా, చిక్సిత నిమిత్తం బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చిన్నారి అమ్మమ్మ కల్యాణి చిక్సిత పొందుతూ మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# మహారాష్ట్రలో బీజేపీ కూటమి మహా విజయం వెనక 5 కారణాలు ఇవే..




**హైదరాబాద్ పెన్ పవర్:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమి అఖండ విజయం దిశగా దూసుకుపోతుంది. ఎగ్జిట్ పోల్స్ అంచనాలకు మించి భారీ మెజార్టీ సాధిస్తోంది. మహారాష్ట్రలో ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మేజిక్ ఫిగర్ 145 సీట్లను ఇప్పటికే అధిగమించిన మహాయుతి కూటమి.. 200 సీట్ల మార్క్‌ను సైతం క్రాస్ చేసింది. మహా వికాస్ అఘాడీ కూటమిని చిత్తు చేస్తూ.. ప్రస్తుతం 220 స్థానాల్లో ఎన్డీఏ కూటమి అధిక్యంలో దూసుకుపోతుంది. మెజార్టీ ఎగ్జిట్ పోల్స్ అంచనాల మేరకే మహా ఫలితాలు వెలువడుతున్నాయి.మరాఠా గడ్డపై అధికార మహాయుతి కూటమి తిరిగి అధికారం నిలబెట్టుకుంటుందని మెజార్టీ ఎగ్జిట్ పోల్స్ అంచనా వేయగా.. వెలువడుతోన్న ఫలితాల సరళి ఎగ్జిట్ పోల్స్ అంచనాలను నిజం చేసింది. అయితే, మహారాష్ట్రలో మహయుతి కూటమి తిరిగి అధికారం నిలుబెట్టుకోవడానికి కారణాలేంటి..? పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటిన ఇండియా కూటమి ఘోర పరాభవం చవిచూడటానికి దారి తీసిన పరిస్థితులేంటి..? ముఖ్యంగా మహాయుతి కూటమి చారిత్రాత్మక విజయానికి దోహదం చేసిన అంశాలేంటి..? అంటే బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమి విజయానికి ముఖ్యంగా 5 అంశాలు దోహదం చేశాయి.

### 1. ఉచిత పథకాల హామీ

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమి విజయం సాధించడంలో 'ఉచితాలు' క్రియాశీలక పాత్ర పోషించాయి. ఎన్నికల ప్రచారంలోనూ బీజేపీ ఫ్రీబీస్‌పై జోరుగా క్యాంపెయినింగ్ చేసింది. ముఖ్యంగా మహయుతి కూటమి ప్రవేశపెట్టిన 'ముఖ్యమంత్రి మాఝీ లడ్కీ బహిన్ యోజన స్కీమ్, లడ్కా భావు యోజన పథకంతో పాటు ఉచిత ఎల్‌పీజీ సిలిండర్ల వాగ్దానాలు మరాఠా ఓటర్లను విపరీతంగా ఆకర్షించినట్లు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

ముఖ్యమంత్రి మాఝీ లడ్కీ బహిన్ యోజన స్కీమ్ కింద 21 నుండి 65 సంవత్సరాల మహిళలకు ప్రభుత్వం నెలకు రూ.1500 ఆర్థిక సహాయం అందజేస్తోంది. ఈ ఎన్నికల్లో గెలిస్తే మాఝీ లడ్కీ బహిన్ యోజన స్కీమ్ కింద రూ.2,100 ఇస్తామని హామీ ఇచ్చింది. రాష్ట్రంలోని నిరుద్యోగ యువత, విద్యార్థులకు వృత్తి నైపుణ్యాలు నేర్పించడంతో పాటు.. ఉద్యోగ అవకాశాలతో సన్నద్ధం చేయడం కోసం ప్రభుత్వం ఈ స్కీమ్ ప్రవేశపెట్టింది. ముఖ్యంగా రెండు ఈ పథకాల్లో మహయుతి గెలుపులో కీ రోల్ పోషించాయి.

### 2. కుల సమీకరణాలు

లోక్ సభ ఎన్నికల్లో మహారాష్ట్రలోని ముస్లింలు ఓటర్లంతా పెద్ద ఎత్తున మహా వికాస్ అఘాడీ కూటమికి జై కొట్టారు. మరాఠా రిజర్వేషన్ల విషయంలో బీజేపీ సంప్రదాయ ఓటర్లు అయిన ఓబీసీలు కాషాయ పార్టీపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో పార్లమెంట్ ఎన్నికల్లో మహారాష్ట్రలో బీజేపీకి భారీ ఎదురు దెబ్బతగలింది. లోక్ ఎన్నికల ఫలితాలతో గుణపాఠం నేర్చుకున్న బీజేపీ మరాఠాలు, ఓబీసీలకు దగ్గర అయ్యాయి. శివసేన, ఎన్సీపీ పార్టీలు కూడా రెండుగా చీలడం కూడా మహాయుతి కూటమికి కలిసి వచ్చింది.

లోక్ సభ ఎన్నికల్లో కాషాయ పార్టీకి దూరంగా ఉన్న ఓబీసీలు అసెంబ్లీ ఎన్నికల్లో కమలం పార్టీకి ఓట్లు గుద్దడంతో మహయుతి కూటమి ఘన విజయం సాధించింది. దీంతో పాటుగా రైతులు, మహిళలు, యువతను ఆకర్షించేలా ఎన్నికలకు ముందు అధికార కూటమి తీసుకొచ్చిన పథకాలు సైతం ఎన్డీఏ కూటమి విజయంలో పాత్ర పోషించాయి.

### 3. నినాదాలు

మహారాష్ట్ర ఎన్నికల ప్రచారం ముఖ్యంగా నినాదాలే చుట్టే తిరిగిందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఇండియా కూటమి కులగణన డిమాండ్ వ్యతిరేకంగా.. ప్రధాని మోడీ.. 'ఏక్ హై తో సేఫ్ హై' అనే నినాదంతో ప్రచారం హోరెత్తించగా.. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఇచ్చిన "బాటేంగే టు కటేంగే" స్లోగన్ మహా పాలిటిక్స్ ను మరో లెవల్ కు తీసుకెళ్లింది. కలిసి ఉంటునే జాగ్రత్త ఉంటామని మోడీ ఓటర్లకు వివరించగా.. కులాల పేరుతో విడిపోతే హిందువుల కింద పడిపోతామని సీఎం యోగి ఆదిథ్య నాథ్ జోరుగా ప్రచారం చేశారు.

యోగి బాటేంగే టు కటేంగా నినాదాన్ని ఆర్ఆర్ఎస్ కూడా పెద్ద ఎత్తున జనంలోకి తీసుకుపోవడంతో మహయుతి కూటమి విజయానికి మార్గం మరింత సుగమమం అయ్యింది. యోగి కటేంగే టు బటేంగ్ నినాదంపై మహయుతి కూటమిలో విభేదాలు వచ్చినప్పటికీ బీజేపీ నేతల వెనక్కి తగ్గకపోవడం హిందువులను మరింత ఏకం చేసింది. అర్బన్, సెమీ అర్బన్ ప్రాంతాల్లో "బాటేంగే టు కటేంగే" ఈ వ్యూహం బాగా వర్కౌట్ అయ్యింది.

### 4. విదర్భ

మహారాష్ట్రంలో ఏ కూటమికి ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్న విదర్భలో మెజార్టీ సీట్లు గెలవడం ముఖ్యం. ఇక్కడ ఎక్కువ స్థానాలు గెల్చుకున్న పార్టీనే దాదాపు మరాఠా గడ్డపై గవర్నమెంట్ ఫామ్ చేస్తోంది. అయితే, ఈ ఏడాది జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో విదర్భలో బీజేపీ ఘోర పరాజయం పాలైంది. 10 పార్లమెంట్ స్థానాలకు గానూ కేవలం మూడు చోట్లనే విజయం సాధించింది. దీంతో పార్లమెంట్ ఎన్నికల ఫలితాలతో మేలుకున్న మహాయుతి కూటమి విదర్భపై స్పెషల్ ఫోకస్ పెట్టింది.

విదర్భలో తిరిగి పట్టు చేజిక్కించుకోవడం కోసం ఏ అవకాశాన్ని ఎన్డీఏ వదులుకోలేదు. బెంగాల్, హర్యానాలో బీజేపీ సక్సెస్ కావడంలో కీ రోల్ పోషించిన వ్యూహకర్త కైలాష్ విజయవర్గియాను మహయుతి కూటమి విదర్భలో దించింది. అతను 100 మంది సభ్యుల బృందంతో రెండు నెలల పాటు విదర్భలో మకాం వేసి బీజేపీ పుంజుకునేలా చేశాడు. ఆర్ఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి విదర్భలో మహయుతి కూటమి స్ట్రాంగ్ అయ్యేలా చేశాడు. దీంతో విదర్భలో ఈ సారి మహయుతి కూటమికి సంచలనాలు ఫలితాలు నమోదు చేసింది.మహారాష్ట్రలో బీజేపీ ఎన్నికల యంత్రాంగం బాగా పనిచేసింది. మహా వికాస్ అఘాడీ కూటమి నేతల కంటే ఎక్కువగా.. మహయుతి టాప్ లీడర్స్ ప్రచారం హోరెత్తించారు. ప్రధాని నరేంద్ర మోడీ 106 అసెంబ్లీ నియోజకవర్గాలను 10 ర్యాలీల్లో కవర్ చేయగా, కేంద్ర హోంమంత్రి అమిత్ షా 16 ర్యాలీల ద్వారా 38 సెగ్మెంట్లలో ప్రచారం చేశారు. యోగి ఆదిత్య నాథ్ సైతం మహారాష్ట్ర ఎన్నికల్లో కటేంగ్ తో బటేంగే అంటూ ప్రచారాన్ని పీక్ స్టేజ్ కు తీసుకుపోయారు. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే రికార్డ్ స్థాయిలో 75 ర్యాలీల్లో ప్రసంగించారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ 72 ర్యాలీలు మరియు రోడ్‌షోల్లో పాల్గొన్నారు.

ఎన్సీపీ అధినేత శరద్ పవార్ 55 ర్యాలీలలో మాట్లాడారు. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే 7, 9 ర్యాలీలకు మాత్రమే పరిమితమయ్యారు. పోల్ మేనేజ్మెంట్ సైతం మహయుతి కూటమి సీరియస్ తీసుకుని పని చేసింది. ఓటర్ లిస్ట్ దగ్గర పెట్టుకుని బూత్ లోని ప్రతి ఓటర్ ను నేతలు కలిసి ఓటు వేయాలని అభ్యర్థించారు. పోలింగ్ రోజు మధ్యాహ్నం వరకు ఓట్లు వేయని ఓటర్లను కలిసి ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఈ ఐదు కారణాలు మహారాష్ట్రలో మహయుతి కూటమి విజయానిక దోహదం చేశాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేశారు.

# మహారాష్ట్రలో సీఎం సీటుపై నరాలు తెగే ఉత్కంఠ.. షిండే అలా.. ఫడ్నవీస్ ఇలా..!




**హైదరాబాద్ పెన్ పవర్:** మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు ఎన్డీయేకు అనుకూలంగా రావడంపై మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ స్పందించారు. సమష్టిగా కలిసి ముందుకెళ్లడం వల్లే ఇది సాధ్యమైందని, మోదీ అండగా ఉండటం వల్ల ఇది సాధ్యమైందని మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలపై దేవేంద్ర ఫడ్నవీస్ 'ఎక్స్'లో ట్వీట్ చేశారు.సీఎం పదవి ఎవరు చేపట్టనున్నారనే అంశంపై ప్రస్తుతానికైతే ఫడ్నవీస్ స్పందించలేదు. అయితే.. ఫడ్నవీస్ తల్లి మాత్రం తన కొడుకే ముఖ్యమంత్రి అవుతాడని విశ్వాసం వ్యక్తం చేశారు. ఫడ్నవీస్ చాలా కష్టపడ్డాడని, ఆ కష్టం వృథాగా పోలేదని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో ఉత్కంఠ వీడిపోయిన సంగతి తెలిసిందే. గెలుపు ఎవరిదో తేలిపోయింది.బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమి 226 స్థానాల్లో ఆధిక్యం కనబర్చి అధికారం ఎవరిదో చెప్పకనే చెప్పేసింది. ఎన్డీయే రికార్డు స్థానాలను కైవసం చేసుకుని మహారాష్ట్రలో కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుందని స్పష్టమైంది. అయితే.. సీఎం అభ్యర్థి ఎవరనే అంశంపై కూటమిలో లుకలుకలు మొదలయ్యాయి. ప్రస్తుతం సీఎంగా ఉన్న ఏక్ నాథ్ షిండేనే మళ్లీ సీఎం అవుతారని ఈ కూటమిలో ఒక పార్టీ అయిన షిండే నేతృత్వంలోని శివసేన బలంగా నమ్ముతోంది. అతిపెద్ద పార్టీకే సీఎం పదవి ఇవ్వాలని రూలేం లేదని, కూటమిలోని అన్ని పార్టీల ముఖ్య నేతలు కూర్చొని సీఎం పదవి ఎవరికి ఇవ్వాలనేది నిర్ణయిస్తామని ఫలితాల రోజే ఏక్ నాథ్ షిండే చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి.సీఎం పదవిపై మహారాష్ట్రలో హైడ్రామా చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఫడ్నవీస్ సీఎం అవుతారని మహారాష్ట్ర బీజేపీ శ్రేణులు భావిస్తున్నాయి. బీజేపీకి అతి పెద్ద పార్టీగా అవతరించడం, సింగిల్ గానే అత్యధిక స్థానాలను కైవసం చేసుకోవడంతో సీఎం స్థానం బీజేపీ చేతుల్లోంచి జారిపోతుందని భావించలేం. ఎన్సీపీ చీఫ్, డిప్యూటీ సీఎం అజిత్ పవార్ కూడా సీఎం పదవి ఆశిస్తున్నారు.అజిత్ పవార్ పేరును ఆ పార్టీ నేత అమోల్‌మిట్కారీ సీఎం రేసులోకి తీసుకొచ్చారు. పుణెలో డిప్యూటీ సీఎం అజిత్ పవార్ నెక్ట్స్ మహారాష్ట్ర సీఎం అంటూ పోస్టర్లు కూడా కనిపించడంతో మహారాష్ట్రలో సీఎం స్థానం ఎవరిని వరిస్తుందోననే ఆసక్తికర చర్చ రాజకీయ వర్గాల్లో జరుగుతోంది.

# ఎన్నికల్లో గెలిచినా పదవి కోల్పోనున్న షిండే!

## మహారాష్ట్ర కాబోయే సీఎం ఫడ్నవీస్ అంటున్న బీజేపీ
## ఫలితాల ట్రెండ్ పై స్పందించిన మహా సీఎం షిండే
## ఇది భారీ విజయం అంటూ ఓటర్లకు ధన్యావాదాలు తెలిపిన నేత



**హైదరాబాద్ పెన్ పవర్:**సాధారణంగా ఎన్నికల్లో ఓటమి పాలైన నేతలు అప్పటి వరకు తమ పదవిని కోల్పోవడం చూస్తుంటాం.. కానీ మహారాష్ట్రలో మాత్రం ఎన్నికల్లో గెలిచినప్పటికీ ఏక్ నాథ్ షిండే తన సీఎం పదవిని కోల్పోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి సంచలన ఫలితాలు నమోదు చేస్తుండడం, మహాయుతి కూటమిలో బీజేపీ సింగిల్ గానే మ్యాజిక్ ఫిగర్ సాధించే అవకాశం ఉండడమే దీనికి కారణం. మహాయుతి కూటమిలో సీఎం సీటు కోసం మూడు పార్టీల నేతలు పట్టుబడుతున్నారు. ఆయా పార్టీలకు చెందిన కిందిస్థాయి నేతలు తమ లీడరే సీఎం అంటూ ప్రచారం చేసుకుంటున్నారు. అయితే, తాజా పరిణామాలతో సీఎం పదవి బీజేపీకీ దక్కనుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇందుకు తగ్గట్లే మహారాష్ట్రకు కాబోయే సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ అంటూ బీజేపీ మహారాష్ట్ర నేతలు ప్రకటనలు విడుదల చేస్తున్నారు. మహారాష్ట్ర అసెంబ్లీలో మొత్తం 288 సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మ్యాజిక్ ఫిగర్ 145 సీట్లు.. ప్రస్తుతం బీజేపీ అభ్యర్థులు 149 స్థానాల్లో ముందంజలో

ఉన్నారు. చివరి వరకూ ఇదే ట్రెండ్ కొనసాగితే బీజేపీ సింగిల్ గానే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉంటుంది. కూటమిగా పోటీ చేసిన నేపథ్యంలో శివసేన (షిండే వర్గం), ఎన్సీపీ (అజిత్ పవార్ వర్గం) నేతలకూ ప్రభుత్వంలో తగిన ప్రాధాన్యం కల్పిస్తుందని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. అయితే, ముఖ్యమంత్రి సీటు మాత్రం బీజేపీ వదులుకోదని చెబుతున్నారు.

**ఇది భారీ విజయం: షిండే**

మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల ట్రెండ్ పై మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండే స్పందించారు. మహాయుతి కూటమికి ఇది భారీ విజయమని వ్యాఖ్యానించారు. మహిళలు, రైతులు సహా ఓటర్లందరికీ షిండే ధన్యవాదాలు తెలిపారు. కాగా, ఇప్పటి వరకు వెలువడిన ఫలితాల్లో మహాయుతి కూటమికి చెందిన ఏడుగురు అభ్యర్థులు గెలుపొందారు. మరో 211 స్థానాల్లో కూటమి అభ్యర్థులు ముందంజలో ఉన్నారు. ఇక ఎంవీఏ కూటమి అభ్యర్థులు 57 చోట్ల ఆధిక్యంలో కొనసాగుతున్నారు.

# ఆర్థిక ఇబ్బందులు అధిగమించేందుకు.. అమెరికాలో ఆయాలుగా మారుతున్న ఆంధ్ర, తెలంగాణ విద్యార్థులు

- పార్ట్ టైం ఉద్యోగాలు దొరక్క ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు
- క్యాంపస్ బయట ఉద్యోగాలు చేయడం నిబంధనల ఉల్లంఘనే అయినా తప్పని పరిస్థితుల్లో ఉద్యోగాలు
- గంటకు 13 నుంచి 18 డాలర్లు అందుకుంటున్న వైనం
- ఉద్యోగంతోపాటు భోజనం, వసతి కూడా లభిస్తుండటంతో అటువైపే మొగ్గు



**హైదరాబాద్ పెన్ పవర్:**ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన భారతీ య విద్యార్థులకు పార్ట్ టైం ఉద్యోగాలు దొరక డం కష్టంగా మారడంతో జీవనం దుర్భరంగా మారింది. దీంతో ఆర్థిక ఇబ్బందులను అధిగమించేందుకు బేబీ సిట్టర్ (ఆయా)లుగా మారుతున్నారు. క్యాంపస్ జాబ్స్ కాకుండా ఇలా చేయడం నిబంధనలు ఉల్లంఘించడమే అయినా, పూటగడిచేందుకు తప్పని పరిస్థితుల్లో ఈ పనులు చేస్తున్నారు. అమెరికాలో బేబీ సిట్టర్లుగా మారుతున్న వారిలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ విద్యార్థులే ఎక్కువ కావడం గమనార్హం. అమ్మాయిలే ఎక్కువగా ఆయాలుగా జాబ్స్ ఎంచుకుంటున్నారు. తిండి, ఉండేందుకు ఇంత చోటు కూడా లభించడంతోపాటు రక్షణ కూడా ఉంటుందని దీనిని ఎంచుకుంటున్నారు. అది కూడా భారతీయ కుటుంబాల్లో పనిచేసేందుకే మొగ్గు చూపుతున్నారు.

వారు పనిచేస్తున్న ప్రదేశం బట్టి వేతనం అందుకుంటున్నారు. 'ఓపెన్ డోర్స్ 2024' నివేదిక ప్రకారం.. టెక్సాస్ లో దాదాపు 39 వేల మంది, ఇల్లినాయిస్‌లో 20 వేల మంది, ఒహియోలో 13,500 మంది, కనెక్టికట్‌లో 7 వేల మంది భారతీయ విద్యార్థులు ఉన్నారు. వీరిలో 50 శాతం మంది తెలుగు రాష్ట్రాల వారే కావడం గమనార్హం. బేబీ సిట్టర్లుగా మారుతున్న విద్యార్థులు గంటకు 13 నుంచి 18 డాలర్ల మధ్య అందుకుంటున్నట్టు 'టైమ్స్ ఆఫ్ ఇండియా' పేర్కొంది. తాను ఆరేళ్ల బాలుడిని రోజుకు 8 గంటలపాటు చూసుకుంటున్నందుకు గంటకు 13 డాలర్లు అందుకుంటున్నట్టు హైద రాబాద్‌కు చెందిన ఓ విద్యార్థి పేర్కొన్నాడు. బాబును చూసుకోవడం వల్ల తనకు భోజనం కూడా ఉచితంగా లభిస్తోం దని చెప్పుకొచ్చాడు. కనెక్టికట్‌లో ఉన్న మరో విద్యార్థి మాట్లాడుతూ.. తాను వారానికి ఆరు రోజులపాటు రెండున్నరేళ్ల పాపను చూసుకుం టున్నట్టు చెప్పాడు. ఆ రోజుల్లో చిన్నారి తల్లిదండ్రులే తనకు భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తున్నట్టు చెప్పాడు. ఆదివారాల్లో మాత్రం స్నేహితుడి గదిలో ఉంటున్నట్టు పేర్కొన్నాడు.

# హరీశ్ రావు గుర్తు పెట్టుకో.. రేవంత్ నమ్మకం.. భట్టి బ్రాండ్:

## కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్ రెడ్డి
## అసహనంతో హరీశ్ఏదేదో మాట్లాడ్తుండు



**హైదరాబాద్ పెన్ పవర్:**పత్తి కొనుగోళ్లలో ఎలాంటి సమస్య లేదని, బీఆర్ఎస్ కావాలనే రాద్ధాంతం చేస్తోందని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్ రెడ్డి అన్నారు. ఖమ్మంలో హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై లేని పోని ఆరోపణలు చేశాడని ఫైర్అయ్యారు. గాంధీ భవన్ లో జరిగిన ప్రెస్ మీట్ లో ఆయన మాట్లాడుతూ 'అధికారం దక్కించుకోవాలనే అసహనంతో హరీశ్ ఏదేదో మాట్లాడుతున్నారని అన్నారు.పత్తిని ఉదయం 8 గంటలకు ఎందుకు కొనుగోలు చేయలేదని అంటుండు...8 గంటలకు ఎక్కడైనా కొనుగోలు చేస్తరా? ఇప్పటికే 3,66,140 లక్షల మెట్రిక్ టన్నుల పత్తిని ప్రభుత్వం కొనుగోలు చేసింది. వారం నుంచి రైతుల ఖాతాల్లో బోనస్ పడుతుంది. ఏనుముల రేవంత్ అంటే ఎగ్గొట్టే రేవంత్ అంటుండు.కానీ ఏనుముల అంటే ఎస్యూరెన్సు రేవంత్ రెడ్డి. భట్టి అంటేనే బ్రాండ్ అని హరీశ్ రావు గుర్తు పెట్టుకోవాలి' అని సూచించారు అన్వేష్ రెడ్డి.

# ఫ్రీ బస్ జర్నీతో నష్టాల్లో ఉన్న ఆర్టీసీ లాభాల్లోకి: మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్ పెన్ పవర్:**మహిళలకు ఫ్రీ బస్ జర్నీతో నష్టాల్లో ఉన్న ఆర్టీసీ లాభాల బాట పట్టిందన్నారు మంత్రి పొన్నం ప్రభాకర్. హైదరాబాద్ లోని రవాణా శాఖ ప్రధాన కార్యాలయంలో టీజీఎస్ఆర్టీసీ పనితీరుపై మంత్రి పొన్నం రివ్యూ చేశారు. ఈ సమావేశంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, కొత్త బస్సుల కొనుగోలు, లాజిస్టిక్స్, ఆర్థిక పరమైన అంశాలపై ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడిన పొన్నం.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ఆర్టీసీ సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. ఈ పథకంలో భాగంగా నవంబర్ 20 వరకు 111 కోట్ల జీరో టికెట్లను సంస్థ జారీ చేసిందని.. ఫలితంగా రూ.3747 కోట్లను మహిళలు ఆదా చేసుకున్నారని తెలిపారు.

మహాలక్ష్మి పథకం వల్ల గతంలో నష్టాల్లో ఉన్న ఆర్టీసీ లాభాల్లోకి వెళ్లిందన్నారు మంత్రి పొన్నం. ఆర్టీసీకి ఇది శుభసూచకమన్నారు. ఈ పథకం అమలుకు ముందు 69 శాతంగా ఆక్యూపెన్సీ రేషియో(ఓఆర్).. ప్రస్తుతం 94 శాతానికి పెరిగిందని గుర్తు చేశారు. మొత్తం ప్రయాణికుల్లో 65.56 శాతం మహిళలే ఉంటున్నారని వివరించారు. ఈ పథకాన్ని వినియోగించుకుంటోన్న మహిళల సంఖ్య క్రమంగా పెరుగుతోందని, రద్దీకి అనుగుణంగా కొత్త బస్సుల కొనుగోలుకు ప్రణాళికను రూపొందించుకోవాలని ఆర్టీసీ ఉన్నతాధికారులను ఆదేశించారు. వీలైనంత త్వరగా కొత్త బస్సులు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.


2023 డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో 1389 కొత్త బస్సులను ఆర్టీసీ కొనుగోలు చేసిందని తెలిపారు మంత్రి పొన్నం. మొదటి విడతలో మహబూబ్‌నగర్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాల్లోని మహిళా స్వయం సహాయక బృందాలకు అద్దె బస్సులను అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మరణించిన, మెడికల్ అన్‌ఫిట్ అయిన సిబ్బంది జీవిత భాగస్వాములకు, పిల్లలకు ఇచ్చే కారుణ్య ఉద్యోగాల నియామక ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు.

# మహారాష్ట్ర ఫలితాలను సరిగ్గా అంచనా వేసిన 'కేకే సర్వే'!

మరోసారి కేకే సర్వే సంచలనం

ఎన్డీయేకు 225 సీట్లు వస్తాయంటూ ఎగ్జిట్ పోల్స్ చెప్పిన కేకే

ప్రస్తుతం 222 స్థానాల్లో ఎన్డీయే కూటమి అభ్యర్థుల ఆధిక్యం




**హైదరాబాద్ పెన్ పవర్:**మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలపై కేకే సర్వే వెల్లడించిన అంచనాలు నిజమయ్యాయి. ఎన్డీయే కూటమి 225 స్థానాల్లో గెలుస్తుందంటూ కేకే సర్వే ఎగ్జిట్ పోల్స్ వెలువరించింది. శనివారం వెలువడుతున్న ఫలితాలు ఈ సర్వే అంచనాలకు అనుగుణంగానే ఉండడం విశేషం. ఈ సర్వే చేసిన వ్యక్తి మన తెలుగు వాడే కావడం గర్వకారణమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుతం ఎన్డీయే అభ్యర్థులు 222 స్థానాల్లో ముందంజలో కొనసాగుతున్నారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత తెలుగు రాష్ట్రాల్లో కేకే పేరు మార్మోగింది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ కూటమి గెలుస్తుందని చెప్పడంతో పాటు జనసేన మొత్తం 21 చోట్ల గెలుస్తుందని కేకే సర్వే పేర్కొంది. ఫలితాలను దాదాపు వందకు వంద శాతం ముందే అంచనా వేయడంతో కేకే సర్వేపై విశ్వసనీయత పెరిగింది. అయితే, హర్యానా అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కేకే సర్వే అంచనాలు తారుమారయ్యాయి. ఈ క్రమంలోనే మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలపై కేకే సర్వే అంచనాలపై కాస్త అపనమ్మకం ఏర్పడింది. జాతీయ స్థాయిలో సర్వేలన్నీ మహారాష్ట్ర ఎన్నికల్లో ఎన్డీయే కూటమిదే విజయమని చెప్పాయి. అయితే, ఏ సర్వే కూడా ఎన్డీయేకు 225 సీట్లు వస్తాయని చెప్పలేదు. కేవలం కేకే సర్వే మాత్రమే ఈ నెంబర్ పేర్కొంది. దీంతో సర్వేపై రాజకీయ వర్గాల్లో సందిగ్ధం వ్యక్తం కాగా.. కేకే స్పందిస్తూ మహారాష్ట్ర ఫలితాలు కచ్చితంగా తమ సర్వే అంచనాలకు అనుగుణంగానే వస్తాయని, కావాలంటే రాసిపెట్టుకోవచ్చని ధీమా వ్యక్తం చేశారు.

# 'బీఆర్ఎస్ ప్రచారానికి ఇది చెంప పెట్టు' అంటూ కాంగ్రెస్ ట్వీట్

కాంగ్రెస్ పాలనలో రియల్ ఎస్టేట్ పడిపోయిందన్న ప్రచారంపై స్పందన

అన్ రాక్ విశ్లేషణకు సంబంధించిన రిపోర్ట్ ను పోస్ట్ చేసిన టీ కాంగ్రెస్

బీఆర్ఎస్ దుర్నీతికి ఇదే నిదర్శనమంటూ మండిపాటు



**హైదరాబాద్ పెన్ పవర్:**కాంగ్రెస్ పార్టీ పాలనలో హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ రంగం కుదేలు అంటూ బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందంటూ అధికార పార్టీ మండిపడింది. రాష్ట్రంలో.. ముఖ్యంగా రాజధాని హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ రంగం గణనీయంగా పురోభివృద్ధి సాధించిందని పేర్కొంది. తాజాగా ప్రముఖ స్థిరాస్తి కన్సల్టెన్సీ అన్ రాక్ వెలువరించిన రిపోర్టే దీనికి నిదర్శనమని, అదేవిధంగా బీఆర్ఎస్ దుర్నీతికి కూడా ఇదే నిదర్శనమని చెప్పింది. ఈమేరకు తెలంగాణ అధికార పార్టీ శనివారం ట్వీట్ చేసింది. అన్ రాక్ కంపెనీ విశ్లేషణలకు సంబంధించిన పేపర్ క్లిప్పింగ్ లను జతచేస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న 2023-2024 ఏడాది ప్రథమార్థంతో పోలిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత 2024-2025 మొదటి ఆరు నెలల్లో ఇళ్ల ధరలు 37% పెరిగాయని అన్ రాక్ విశ్లేషించించిందని కాంగ్రెస్ తెలిపింది. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ పడిపోయిందని బీఆర్ఎస్ కాలకేయులు చేస్తున్న ప్రచారానికి అన్ రాక్ నివేదిక చెంపపెట్టు అని ఘాటుగా విమర్శించింది. గడచిన ఆరు నెలల్లో దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో హైదరాబాద్ నగర స్థిరాస్తి మార్కెట్ బలమైన వృద్ధిని కనబరిచిందని అన్ రాక్ పేర్కొనట్లు తెలిపింది. రాజకీయ ఈర్ష్యతో రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెట్టడం బీఆర్ఎస్ దుర్నీతికి నిదర్శనం అని తెలంగాణ కాంగ్రెస్ మండిపడింది.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి.



**జయశంకర్ భూపాలపల్లి, పెన్ పవర్:**విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ రాహూల్ శర్మ అన్నారు. శనివారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ వంటగదిలో మధ్యాహ్న భోజనం కోసం వండిన వంటకాలను పరిశీలించారు.

స్టోర్ రూమ్, డార్మెటరీ హాల్ లను తనిఖీ చేసి అనంతరం విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో అందిస్తున్న ఆహార పదార్థాలు గురించి అడిగి తెలుసుకున్నారు.

ప్రస్తుతం అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల అద్దె భవనంలో కొనసాగుతున్నదని భవనం అసంపూర్తి నిర్మాణంలో ఉన్నదని సిబ్బంది జిల్లా కలెక్టర్ దృష్టికి స తీసుకు రాగా జిల్లా విద్యాశాఖ అధికారి తో ఫోన్లో మాట్లాడి అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలను మరొక భవనంలోకి తరలించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అందించాలని, శీతాకాలం దృష్ట్యా స్నానాలకు వేడి నీటిని అందించేందుకు వాటర్ హీటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థులకు ఒక జత యూనిఫామ్ మాత్రమే అందించారని మరొక జత యూనిఫామ్ అందించాలని డిఈఓను ఆదేశించారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులకు సకాలంలో హాజరు కావాలని స్పష్టం చేశారు. పాఠశాలలలో ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. విద్యార్థులకు ఏదేని ఆరోగ్య సమస్య వస్తే వెంటనే వైద్య సేవలు అందించాలని, విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల స్పెషల్ ఆఫీసర్ వేణు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వంతెనను ఢీకొని లారీ బోల్తా భారీగా ట్రాఫిక్ జామ్

**నిర్మల్: పెన్ పవర్:**నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని మటెగాం గ్రామ సమీపంలోని రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గుజరాత్ నుంచి విజయవాడకు టైల్స్ లోడ్‌తో వెళ్తున్న లారీ భైంసా-నిర్మల్ జాతీయ రహదారిపై వంతెనను ఢీకొని బోల్తా పడింది. వంతెన మధ్యలో బోల్తా పడడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో బాసర, ముథోల్ వైపు వెళ్లే వాహనాలను కుంటాల మండలంలో ఆర్లి ఎక్స్ రోడ్ నుంచి, భైంసాకు వచ్చే వాహనాలను మాటేగాం నుంచి చింతలబోరి, మహాగం మీదుగా భైంసాకు వెళ్లేలా పోలీసులు దారి మళ్లించారు.

## ఏనుగు మృతి

**హైదరాబాద్ పెన్ పవర్:**తిరుపతి జిల్లా చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట పంచాయతీ పరిధిలోని మామిడి తోటలో ఓ ఏనుగు అనుమానాస్పదంగా మృతి చెందింది. మామిడి తోట యజమాని ఏనుగు మృతిపై భాకరాపేట అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అటవీశాఖ అధికారులు ఏనుగు మృతికి గల కారణాలను అన్వేషిస్తున్నట్లు తెలిపారు. అటవీశాఖ అధికారులు వచ్చి పరిశీలన జరిపారు. గత కొద్ది రోజులుగా చిన్నగొట్టిగల్లు, యర్రావారిపాలెం మండలాల్లో సుమారు 17 ఏనుగుల గుంపు సంచరిస్తున్నట్లు తెలిపారు. మృతి చెందింది మగ ఏనుగని వయసు సుమారు పది సంవత్సరాలు ఉంటుందన్నారు. ఏనుగు మృతికి కారణాలపై అన్వేషిస్తున్నట్లు తెలిపారు.

# కాంగ్రెస్ తో టచ్ లోకి ఎమ్మెల్యేలు..?

**హైదరాబాద్, నవంబర్ 23, పెన్ పవర్:** కాంగ్రెస్ పార్టీలోకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల చేరికలు ఇంకా ఉన్నాయా.. మరి కొంతమంది కాంగ్రెస్ పార్టీ లోకి చేరేందుకు సుముఖంగా ఉన్నారా.. తాజాగా తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ చేసిన కామెంట్స్ ఇందుకు ఊతమిస్తున్నాయి. తెలంగాణ కాంగ్రెస్ పార్టీలోకి త్వరలోనే మరిన్ని చేరికలు ఉంటాయని తెలంగాణ పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సంచలన కామెంట్స్ చేశారు. ఆ చేరికలు కూడా అతి త్వరలోనే ఉంటాయని మహేష్ గౌడ్ ప్రకటించడం విశేషం. హైదరాబాద్ లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రముఖ పారిశ్రామికవేత్త అదానీని అరెస్ట్ చేస్తే, ప్రధాని మోడీ రాజీనామా చేయక తప్పదని, కేంద్రంలో మోడీ ప్రభుత్వం అదానీ, అంబానీ లాంటి వారిని పెంచి పోషిస్తుందని మహేష్ గౌడ్ విమర్శించారు. అలాగే రాహుల్ గాంధీ గతంలోనే చెప్పారని, అదానీకి లాభం చేకూర్చే స్థితిలో కేంద్రం ఉందని చెప్పారన్నారుఈ విషయంలో నిష్పక్షపాతంగా విచారణ చేస్తే ప్రధాని నరేంద్ర మోడీ రాజీనామా చేయాల్సి వస్తుందని, అదానీ గ్రూప్ విచ్చలవిడిగా సంపద పెంచుకునేందుకు ప్రధాని అండదండలు ఉన్నాయన్నారు. అదానీని తక్షణమే అరెస్టు




చేయాలని, పార్లమెంట్ జాయింట్ యాక్షన్ కమిటీ వేసి విచారణ జరపాలన్నారు.ఇక తెలంగాణ రాజకీయ అంశాలపై మహేష్ గౌడ్ సంచలన కామెంట్స్ చేశారు. త్వరలోనే కాంగ్రెస్ పార్టీలోకి మరిన్ని చేరికలు ఉంటాయని, అది కూడా కేటీఆర్ తో తిరుగుతున్న ఇద్దరు, ముగ్గురు ఎమ్మెల్యేలు తమతో టచ్ లో ఉన్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేల చేరికల అంశం వివాదాస్పదం అవుతుండగా, స్పీకర్ తన అధికారాన్ని ఉపయోగించి నిర్ణయం తీసుకుంటారన్నారు.తమ పార్టీ అధికారంలో ఉండి తెలంగాణ వ్యాప్తంగా చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనులను చూసి ఎమ్మెల్యేలు తమవైపు వస్తున్నారని, త్వరలోనే ఎంతమంది టచ్ లో ఉన్నారన్నది మీడియాకే తెలుస్తుందని మహేష్ గౌడ్ అన్నారు. ఈ కామెంట్స్ ని బట్టి చూస్తే త్వరలో మరో మారు కాంగ్రెస్ పార్టీలోకి బీఆర్ఎస్ నుండి ఎమ్మెల్యేల చేరికలు ఉంటాయని భావించవచ్చు. మరి మహేష్ గౌడ్ చేసిన కామెంట్స్ పై బీఆర్ఎస్ ఏ విధంగా స్పందిస్తుందో వేచి చూడాలి.

# కవ్వాల్ పరిధిలో గ్రామాల తరలింపు

**అదిలాబాద్, నవంబర్ 23, పెన్ పవర్:** కవ్వాల్ టైగర్ రిజర్వ్ పరిధిలోని గ్రామాల తరలింపుపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కవ్వాల్ టైగర్ రిజర్వ్ లోని మైసంపేట్, రాంపూర్ గూడేలను తొలి విడతగా ఖాళీ చేయిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ అంశంపై మంత్రి కొండా సురేఖ సమీక్ష నిర్వహించారు.అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వులపై మంత్రి కొండా సురేఖ సుదీర్ఘ సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా కీలక సూచనలు చేశారు. ప్రజలకు ప్రభుత్వం పట్ల విశ్వాసాన్ని కల్పిస్తూ.. పునరావాస చర్యలు విజయవంతంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కవ్వాల్, అమ్రాబాద్ టైగర్ రిజర్వులు తెలంగాణ రాష్ట్రానికి ఎంతో ప్రత్యేకతను చేకూర్చాయని అభిప్రాయపడ్డారు.పెరుగుతున్న పులుల ఆహార లభ్యతకు అనుగుణంగా.. జింకల సంఖ్యను పెంచే దిశగా అటవీశాఖ చేపడుతున్న చర్యలపై మంత్రి సురేఖ హర్షం వ్యక్తం చేశారు. అక్కమహాదేవి గుహలకు రాష్ట్ర ప్రభుత్వ పరంగా భూ, జలమార్గాల్లో యాత్రా సౌకర్యం కల్పించేందుకు అవకాశాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. నల్లమల అటవీప్రాంతంలో సలేశ్వరం జాతరను భవిష్యత్తులో అటవీశాఖ చేపట్టనున్న సర్క్యూట్‌లలో చేర్చే దిశగా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లోని నాలుగు గ్రామాలను పునారావా కేంద్రాలకు తరలిస్తున్నట్లుగా అటవీ అధికారులు మంత్రి వివరించారు. కవ్వాల్ టైగర్ రిజర్వ్ లోని మైసంపేట్, రాంపూర్ గూడేలను తొలి విడతగా ఖాళీ చేయిస్తున్నట్లు చెప్పారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలోని మన్ననూర్, మద్దిమడుగు, సోమశిల - దోమలపెంట ఎకో టూరిజం సర్క్యూట్లలో.. ప్రస్తుతం పర్యాటక సేవలు అందిస్తున్నట్లు మంత్రి సురేఖకు వివరించారు.సోమశిల, అమరగిరి ఎకో టూరిజం సర్క్యూట్, దోమలపెంట- శ్రీశైలం ఎకో టూరిజం సర్క్యూట్‌లను రాబోయే రోజుల్లో అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు చెప్పారు. వన్యప్రాణుల దాడుల్లో మరణించే వారికి పరిహారం రూ. 10 లక్షల నుండి రూ. 20 లక్షలకు పెంపుపై చర్చ జరిగింది. వన్యప్రాణుల దాడుల ఘటనల్లో మరణించిన వారికి ఇచ్చే నష్టపరిహారాన్ని.. రూ. 10 లక్షల నుండి రూ. 20 లక్షలకు పెంచే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు మంత్రి సురేఖ తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ మొత్తాన్ని రూ. 5 లక్షల నుంచి 10 లక్షలకు పెంచి ఇస్తున్న విషయాన్ని మంత్రి సురేఖ గుర్తు చేశారు. 'స్టేట్ లెవల్ కమిటీ ఫర్ మిటిగేటింగ్ హ్యూమన్ యానిమల్ కాన్ఫ్లిక్ట్'తో పూర్తిస్థాయి చర్చల తర్వాత పరిహారం పెంపుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని మంత్రి సురేఖ స్పష్టం చేశారు.

# హైదరాబాద్‌లో డిసెంబర్ 8 నుంచి అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

**హైదరాబాద్ పెన్ పవర్:**ఆర్మీలో చేరి దేశానికి సేవలందించాలనుకునే రాష్ట్ర యువతకు శుభవార్త అందుతోంది. తెలంగాణలో అగ్నివీరుల రిక్రూట్‌మెంట్ ర్యాలీ తేదీలు, వేదిక ఖరారయ్యాయి. డిసెంబర్ 8 నుంచి 16 వరకు హైదరాబాద్, గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి అథ్లెటిక్ స్టేడియంలో రిక్రూట్‌మెంట్ ర్యాలీలు జరగనున్నాయి.ఈ రిక్రూట్‌మెంట్ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరగుతుందని అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన యువతను సైన్యంలో అగ్నివీరులుగా చేర్చుకోవడానికి ఈ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ క్లర్క్/ స్టోర్ కీపర్ టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్ కేటగిరీల్లో ఈ భర్తీలు చేపట్టనున్నారు. అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్‌కు 8వ తరగతి ఉత్తీర్ణత కాగా.. ఇతర విభాగాలకు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.

**అలాంటివి నమ్మొద్దు**

బ్బులిస్తే రిక్రూట్‌మెంట్ ర్యాలీలో ఉత్తీర్ణత సాధించడానికి సాయం చేస్తామని ఎవరైనా చెబితే నమ్మొద్దని అధికారులు యువతకు సూచించారు. మోసపూరిత హామీల పట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. అభ్యర్థులకు ఏవైనా సందేహాలు ఉంటే 040-27740059, 27740205 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## కబ్జాకు పాల్పడితే కఠిన చర్యలు

**సంగారెడ్డి పెన్ పవర్:**అమీన్ పూర్ మండల పరిధిలోని సుల్తాన్ పూర్ సర్వే నంబర్ 30లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై మీడియాలో వస్తున్న కథనాలపై తహశీల్దార్ రాధా స్పందించారు. వాస్తవాలను వక్రీకరించి కబ్జాలకు అధికారులు సహకరిస్తున్నారని ప్రచారాన్ని ఖండించారు. సర్వే నంబర్ 30లోని ఇనామ్ భూములను వ్యవహారం కోర్టులో ఉందని, కబ్జాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అమీన్పూర్ తాసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు.

## మహారాష్ట్రలో బీజేపీ విజయంపై చంద్రబాబు హర్షం

**హైదరాబాద్ పెన్ పవర్:**మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలపై సీఎం చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేసారు. ఘనవిజయం సాధించిన బీజేపీ కూటమికి శుభాకాంక్షలుతెలిపారు. అమిత్షా ఫడణవీస్, షిండేకు ఫోన్చేసి శుభాకాంక్షాలు తెలిపారు.

## విద్యార్థులను వేధిస్తే కఠిన చర్యలు

**హైదరాబాద్ పెన్ పవర్:**ఫీజు రియింబర్స్ మెంట్ ను అడ్డుపెట్టుకొని విద్యార్థులకు పరీక్షల సమయంలో హాల్ టిక్కెట్ మరియు ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధిస్తే ఆయా కళాశాలలపై చర్యలు తప్పవని కలెక్టర్ వెట్రీ సెల్వీ హెచ్చరించారు. ఇటువంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే గ్రీవెన్స్ సెల్ నెం. 9491041188 కు గానీ, జిల్లా కలెక్టర్ వారికి గానీ స్వయంగా తెలియజేయవచ్చని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం



**హైదరాబాద్ పెన్ పవర్:** రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మంథని మండలం గాజులపల్లి కేంద్రాన్ని సంఘ డైరెక్టర్ ఆకుల రాజబాపు, గుమ్నూరు కేంద్రాన్ని డైరెక్టర్ లెక్కల కిషన్ రెడ్డి, లక్కేపూర్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సింగిల్విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ మాట్లాడుతూ, సన్న వడ్లకు రూ.500 బోనస్ చెల్లింపు చేయడం తమ ప్రభుత్వం రైతులకు ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమని అన్నారు. ఐటీ, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా తగు చర్యలు చేపడుతున్నామని అన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలిస్తూ వెనువెంటనే ట్యాబ్ లో రైతువారి ధాన్యం, ట్రాన్స్ఫర్ట్ వివరాలు నమోదు చేసి రైతుల బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చూస్తున్నామని అన్నారు. సన్న వడ్లకు బోనస్ చెల్లింపు చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబులకు రైతుల పక్షాన ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సంఘ డైరెక్టర్ కొత్త శ్రీనివాస్, ఉడుత మాధవి-పర్వతాల్ యాదవ్, మున్సిపల్ చైర్పర్సన్ పెండ్రి రమ-సురేష్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయిలి ప్రసాద్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముస్కుల సురేందర్ రెడ్డి, మాజీ ఎంపిపి కొండ శంకర్, నాయకులు పర్వవేన మోహన్, వేల్పుల రాజు, తొగరి ఓదెలు, ఇసంపల్లి శ్రీనివాస్, దాది క్రాంతి, పొనగంటి రమేష్, ఎరుకల నరేష్ రైతులు, సంఘ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయంగా ఇబ్బంది ఉన్నా.. మాలల కోసం రిస్క్ తీసుకున్నా: ఎమ్మెల్యే వివేక్



**హైదరాబాద్ పెన్ పవర్:**మాలలు చాలా తక్కువ సంఖ్యలో ఉన్నారని.. వారి కోసం ఏం చేయకపోయిన ఎవరూ నోరు మెదపరనే అభిప్రాయం అన్ని పార్టీల రాజకీయా నాయకుల్లో ఉందని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. 2024, నవంబర్ 23వ తేదీన గండిపేట్‌లో మాలల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మెల్యే వివేక్ ప్రసంగించారు. మాలల కోసం పోరాడేందుకు తాను బయటకు వచ్చానని.. నాకు రాజకీయంగా ఇబ్బంది ఉన్నా మాలల కోసం రిస్క్ తీసుకున్నానని చెప్పారు. మాలల కోసం పోరాడితే కొందరు తనను విమర్శిస్తున్నారని.. మన పోరాటం చూసి వాళ్లలో గుబులు మొదలైందని అన్నారు. మాలలు అంతా కలిసి బయటకు వస్తే మన సత్తా ఏంటో చూపించుకోవచ్చని పిలుపునిచ్చారు. న్యాయం వైపు నిలబడాలని తన తండ్రి కాకా వెంకటస్వామి ఎప్పుడు చెప్పేవారని గుర్తు చేసుకున్నారు. తన తండ్రి కూడా మాలల అభ్యున్నతి కోసం విశేషంగా కృషి చేశారన్నారు.మాలల కోసం చేస్తోన్న పోరాటంలో తనకు ఎమ్మెల్యే నాగారాజు మద్దతుగా నిలుస్తారని చెప్పారు. నాగర్ కర్నూల్‌లో నిర్వహించిన మాలల మీటింగ్‌కు 50 వేల మంది వస్తారని ఊహించలేదని.. అదే జోష్‌తో హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరగనున్న మాలల సింహగర్జన సభను గ్రాండ్ సక్సెస్ చేయాలని పిలుపునిచ్చారు. మాలల జాతి గౌరవం కోసం నిరంతరం పోరాటం కొనసాగించాలని సూచించారు.

# కాలభైరవ స్వరూపం

**హైదరాబాద్ పెన్ పవర్:**ఒకప్పుడు ఋషులకు త్రిమూర్తులలో బ్రహ్మమెవరని సందేహం వచ్చింది. ఆ సందేహమును తీర్చమని వారు త్రిమూర్తులనే అడిగారు. శంకరుడికి సద్యోదాత, అఘోర, తత్పురుష, ఈశాన, వామదేవ అను అయిదు ముఖములు ఉంటాయి. ఈ అయిదు ముఖములతో ఋషుల వంక చూస్తూ 'అదేమిటి? బ్రహ్మమెవరని అడుగుతారేమిటి? నేనే బ్రహ్మమును' అన్నాడు. బ్రహ్మగారు 'నేనే ఈ లోకములన్నిటిని సృష్టించాను నేనే నిక్కపు కర్తను. నేనే ఈ సమస్త లోకములను ప్రవర్తింపచేశాను. నేనే వీటిని సంహారం చేస్తాను. నేనెప్పుడూ బతికే ఉంటాను. నాకన్నా బ్రహ్మమెవరు? నేనే బ్రహ్మమును' అన్నాడు. పక్కనున్న విష్ణువు 'బ్రహ్మా! నా అంతవాడిని నేను అంటున్నావు. నీవు పుట్టింది నా నాభి కమలంలోంచి కదా! బ్రహ్మమును నేను' అన్నారు. ఇద్దరికీ ఈ విషయంలో జగడం వచ్చింది. మనకి శృతి ప్రమాణం కదా అందుకని వేదములని పిలుద్దాం అని వేదములను పిలిచారు. ఋగ్వేదం ఈ సమస్తమునకు సృష్టికర్త ఏ మహానుభావుడు సంకల్పం చేస్తే మొట్టమొదట నారాయణుడు జన్మించాడో ఎవరు చిట్టచివర ఈ లోకములని తనలోకి తీసుకుంటున్నాడో అటువంటి ఆ పరమశివుడు పరబ్రహ్మము అంది. యజుర్వేదమును పిలిచారు. ఆసురీశక్తులు పోయి ఈశ్వరీ శక్తులు రావడానికి జ్ఞానమును మహేశ్వరుడు ఇస్తాడు. జ్ఞాన యజ్ఞమునందు ఆరాధింపబడుతున్నవాడు కనుక పరమశివుడే పరబ్రహ్మము అని చెప్పింది తరువాత సామవేదమును పిలిచి అడిగారు మూడు కన్నులున్న వాడెవడు ఉన్నాడో ఎవరు ఈ లోకమునంతటినీ తిప్పుతున్నాడో ఆ తిప్పుతున్న వాడిని ఏ యోగులు ఉపాసన చేస్తున్నారో ఏ యోగులకి ఉపాసన చేత జ్ఞానమునందు తెలియబడుతు తనలో తాను రమిస్తూ ఉన్న శివుడు పరబ్రహ్మము' అని చెప్పింది. అధర్వణ వేదము ఏ మహానుభావుడిని భక్తులందరూ సంసార సముద్రమును దాటి దుఃఖమును పోగొట్టుకుని ఆనందమును తెలుసుకోవడానికి ఉపాసన చేస్తున్నారో అటువంటి పరమశివుడు పరబ్రహ్మము' అని చెప్పింది. అంటే సృష్టి చేసింది మనం కాదు, నిలబెట్టింది మనం కాదు,





వేరొకడున్నాడు. తెలుసుకో అని శాస్త్ర ప్రమాణం. నాలుగు వేదములు అదే చెప్తున్నాయి. ప్రణవాన్ని పిలిచారు. ప్రణవం ఎవడు నిరంతరమూ శక్తి స్వరూపముతో క్రీడిస్తూ ఉంటాడో, శక్తి ఆయనను విడిచిపెట్టి ఉండదో, శక్తీశ్వరులై వారున్నారో, అటువంటి శక్తీశ్వరుడై, శక్తి ఆయనతో ఆయన శక్తితో విడివడకుండా కలిసి ఉంటారో అటువంటి పార్వతీ పరమేశ్వరులు, పార్వతి వామార్ధ భాగమునందు ఉన్న శంకరుడే పరబ్రహ్మము' అని చెప్పింది. ప్రణవం చెప్పిన మాటను వాళ్ళు అంగీకరించలేదు. ఈమాటలు రుచించక పోతే ఇప్పుడు ఈశ్వరుడు దండించవలసి ఉంటుంది. ఈశ్వరుడు అంతటా నిండిన పరబ్రహ్మము జ్యోతిగా మారింది. జ్యోతి సాకారం అయింది. సాకారమును చూసినప్పుడు విష్ణువు ఊరుకున్నాడు. బ్రహ్మ నీవు ఎవరు? నువ్వు నా రెండు కనుబొమల మధ్యలోంచి పుట్టిన రుద్రుడవు. నన్ను స్తోత్రం చెయ్యి' అన్నాడు. బ్రహ్మలో మార్పు రాలేదు. ఆయన దండింపబడాలి. ఇపుడు ఆ జ్యోతి ఘోర రూపమును పొందింది. 'ఏమి నీ ఆజ్ఞ అని మొదటి రూపమును అడిగాడు. అహంకారంతో మాట్లాడుతున్నాడు. అయిదవ తలను గిల్లెయ్యి' అంది. ఈ స్వరూపం ప్రచండ రూపమును పొందింది. దిగంబరమై అయిదవతలను గోటితో గిల్లేసింది. ఆ రూపమే కాలభైరవ స్వరూపం. ఇలా జరిగేసరికి బ్రహ్మ నాలుగు తలకాయలు పట్టుకు వెళ్లి అమ్మవారి చేతుల క్రింద పెట్టేసి ఈశ్వరా! నేను చేసిన పొరపాటు మన్నించి ఉదారుడవై నన్ను కాపాడు అన్నాడు. శంకరుడు కాల భైరవునితో నీవు కాలము వలె ప్రకాశించుచున్నావు. కాలము ఎలా వెళ్ళిపోతూ ఉంటుందో అలా ఉంది నీ నడక. నీ నడకలో బ్రహ్మ తల తెగిపోయింది. నిన్ను ఇవాళ్టి నుంచి కాలభైరవ అని పిలుస్తారు. నీవు ఎంత గొప్ప వాడవయినా బ్రహ్మ తల తెంపేశావు కాబట్టి నీకు బ్రహ్మహత్యాపాతకం అంటుకుంది. ఈ అయిదవ తలకాయ పుర్రెను చేతిలో పట్టుకుని పన్నెండు సంవత్సరములు భిక్షాటన చేసి ఆ కపాలంలో తిను. నీ బ్రహ్మ హత్యా పాతకం పోతుంది. పుట్టేప్పటికే నీ స్వరూపమును చూసేటప్పటికీ లోకం అంతా గజగజలాడిపోయింది. నిన్ను భైరవ శబ్దంతో పిలుస్తారు. ఎవడు ఈశ్వరుని ధిక్కరించి బ్రతుకుతాడో వాడి ప్రాణోత్క్రమణము అవగానే నువ్వే కనపడతావు. దీనిని 'భైరవ యాతన' అంటారు. జీవుడు నిన్ను చూసి హడలిపోతాడు. కానీ ఎవరు నీ గురించి వింటారో, శివాలయమునకు వచ్చినపుడు ఎవరు కాలభైరవుడి యందు శిరస్సు వంచి నమస్కరిస్తారో వాళ్ళ పాపమును నీవు తీసెయ్యి. అలా తీసేసే శక్తిని నేను నీకు ఇచ్చాను నిన్ను 'అమర్దకుడు' అని పిలుస్తారు.

ఇకనుంచి నీవు నా దేవాలయములలో క్షేత్ర పాలకుడవయి ఉంటావు. భక్తుల పాపములను నీవు తీసిన వాటిని నువ్వు తినేసెయ్యి. నువ్వు పాపములను తినేసి వాళ్ళను రక్షిస్తావు కాబట్టి నీకు 'పాప భక్షకుడు' అనే పేరును ఇస్తున్నాను. నిన్ను కాశీ క్షేత్రమునకు అధిపతిగా ఉంచుతున్నాను. నీ అనుగ్రహం ఉన్నవాళ్ళే కాశీక్షేత్ర ప్రవేశం చేస్తారు' అని చెప్పాడు. ?

# ఈ నగరానికి ఏమైంది: బిర్యానీలో బొద్దింకలు.. కస్టమర్లకు వాంతులు

**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్ హోటళ్లకు ఏమైంది.. బిర్యానీకి బ్రాండ్ అంబాసిడర్ గా ఉన్న హైదరాబాద్ లో హోటళ్లకు ఈ దుస్థితి ఎందుకొచ్చింది. ఇటీవల వరుసగా జరుగుతున్న సంఘటనల వల్ల ప్రతి ఒక్కరిలో ఇదే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. మొన్నటిదాకా హైదరాబాద్ బిర్యానీ పేరు చెబితేనే నోరూరిన జనాలకు ఇప్పుడు హోటళ్లలో బిర్యానీని తలుచుకుంటేనే వాంతి చేసుకునే పరిస్థితి దాపురించింది. ఇటీవల వరుసగా చోటు చేసుకుంటున్న ఘటనలే ఇందుకు కారణం. మొన్న హైదరాబాద్ లోని కేపీహెచ్బీ లో ఓ టిఫిన్ సెంటర్లో చట్నీతో బొద్దింకలు వచ్చిన ఘటన మరువక ముందే అల్వాల్ లోని ఓ హోటల్లో బిర్యానీలో బొద్దింక దర్శనమిచ్చిన ఘటన ఫుడ్ లవర్స్ ను కలవర పెడుతోంది.ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలిలా ఉన్నాయి.. అల్వాల్ లోని యతి హౌస్ హోటల్ లో బిర్యానీ లో బొద్దింకలు దర్శనమిచ్చిన ఘటన కస్టమర్లను ఒక్కసారిగా ఉలిక్కి పడేలా చేసింది. బిర్యానీ తింటున్న సమయంలో బొద్దింకలు ప్రత్యక్షం కావడంతో హోటల్ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు కస్టమర్లు. ఈ ఘటనపై హోటల్ యాజమాన్యాన్ని ప్రశ్నించగా అలాంటిదేమీ లేదని బుకాయించింది యాజమాన్యం. దీంతో కస్టమర్లు కిచెన్ లో ఉన్న ఫ్రిజ్లో చూడగా.. గోంగూర పచ్చడి, చికెన్ లెగ్ పీస్ లలో బూజు పట్టి ఉన్నట్లు గుర్తించారు. బిర్యానీ తిన్న వెంటనే కస్టమర్లకు ఫుడ్ పాయిజన్ అయ్యి వాంతులు చేసుకున్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు వెంటనే నాణ్యత లేని ఆహారాన్ని విక్రయిస్తున్న హోటళ్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు కస్టమర్లు. ఇటీవల లోతుకుంట





లోని గ్రిల్ హౌస్ లో షవర్మా తిని పలువురు అస్వస్థతకు గురైన ఘటన మరువక ముందే అల్వాల్లో బిర్యానీలో బొద్దింకలు రావడంతో కస్టమర్లు హోటల్లో ఆహారం తినాలంటే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.